క్లుప్తంగా

ఎస్పీని కలిసిన సీఐ శ్రీనివాసరావు



కోనేరుసెంటర్: జిల్లా ఎస్పీ పి. జాషువాను గుడివాడ వన్ టౌన్ సీఐ ఇంద్ర శ్రీనివాసరావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల సీఐల బదిలీల్లో భాగంగా ఏలూరు దిశ పోలీస్‌స్టేషన్ నుంచి గుడివాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు సీఐగా వచ్చిన శ్రీనివాసరావు బాధ్యతలు తీసుకున్న అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శ్రీనివాసరావును ఎస్పీ అభినందించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా జాగ్రత్తలు వహించాలని ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు సూచించారు.

వస్త్రాల పంపిణీ



నాగాయలంక: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిత్యాన్నదాన కమిటీ ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సహకారంతో 50 మంది నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు మంగళవారం నూతన వస్త్రాలు అందజేశారు. ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్న నాగాయలంక వాసులు తలశిల సురేష్, అనూష దంపతులు వీటిని సమకూర్చారు. దాత తరఫున నిర్వాహక కమిటీ సభ్యులు వీటిని అందజేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది.

వైఎస్సార్ పెన్షన్ కానుక అందజేత



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండల పరిధి తెలుగురావుపాలెంలో కొత్తగా మంజూరైన 14 మందికి పెన్షన్ కానుకను సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు అందజేశారు. స్థానిక సచివాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ రాచూరి మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు 149 మందికి గ్రామానికి చెందిన ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ సభ్యులు ఘట్టమనేని బాబూరావు నోట్ పుస్తకాలు, బ్యాగులను పంపిణీ చేశారు. దాత బాబూరావు మాట్లాడుతూ విద్య ద్వారానే ఉన్నత స్థితికి చేరుకోగలరని చెప్పారు. ఈ సందర్భంగా దాత బాబూరావును హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు అభినందించారు.

క్రీడా పరికరాల కొనుగోలుకు విరాళం



పెడన: పాఠశాలలో క్రీడా పరికరాల కొనుగోలుకు భట్ల జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షుడు మట్టా రాధాకృష్ణమూర్తి రూ. 10 వేలను అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని హెచ్‌ఎం ఉషకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉపాధ్యాయులు ఉమా మహేశ్వరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు చేశారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చి స్వామివారి పుట్టలో పాలుపోసి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో 150 మంది భక్తులు అభిషేకాలు చేయించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

ఆహ్లాదం..ఆరోగ్యం

- రూ. 3.54 కోట్లతో ఆరు పార్కుల అభివృద్ధి
- నాలుగేళ్లలో నూతన పార్కుల ఏర్పాటు
- 46వ డివిజన్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పార్కు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత నాలుగున్నరేళ్లలో నగరంలో పలు పార్కులు అభివృద్ధి చెందాయి. పార్కులను అందంగా తీర్చిదిద్దడంతోపాటు వాటర్ ఫౌంటేన్లు, సందర్శకులు సెల్ఫీలు తీసుకునేందుకు వీలుగా గోడలపై త్రీడీ చిత్రాలు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. ఇవి నగర ప్రజలకు ఆనందాన్ని, ఆహ్లాదాన్ని అందించడంతోపాటు ఆరోగ్యాన్ని పెంపొందింపజేస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక కృషితో నగరంలోని పలు డివిజన్లలో నూతన పార్కుల ఏర్పాటు, ఉన్న పార్కుల అభివృద్ధి వంటి పనులు జరిగాయి. పార్కుల అభివృద్ధి, ఏర్పాటుతో ఆయా ప్రాంతాల ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులకు చేరుకుని సేదతీరుతున్నారు. ఉత్సాహం, ఉల్లాసంతోపాటు ఆరోగ్యాన్ని పొందుతున్నారు.



ప్రధాన పార్కులో ఏర్పాటు చేసిన ఐ లవ్ మచిలీపట్నం బోర్డు

రూ. 2 కోట్లతో శ్రీనివాస నగర్‌లో ఏర్పాటు..

మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆరు పార్కులను రూ. 3.54 కోట్లతో అభివృద్ధి చేశారు. 46వ డివిజన్ శ్రీనివాస్ నగర్‌లో సుమారు రూ. 2 కోట్లతో నూతన పార్కును ఏర్పాటు చేశారు. ఈ పార్కును త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే డీఈఓ కార్యాలయం ముందున్న బ్రహ్మపురం పార్కును ప్రారంభించాల్సి ఉంది. మున్సిపల్ ప్రధాన పార్కులో ఇటీవల కొద్ది నెలల కిందట రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులు చేశారు. ఈ పార్కులో 3డీ సెల్ఫీ చిత్రాలు, విగ్రహాల వద్ద వాటర్ ఫౌంటేన్లు, కూర్చునేందుకు సిమెంట్ బెంచీలు, జింకల బొమ్మలు, ఐ లవ్ మచిలీపట్నం బోర్డు తదితర పనులు చేశారు. ఈ ప్రధాన పార్కును ప్రతి రోజూ సుమారు 2 వేల మందికి పైగా ప్రజలు సందర్శించి సేద తీరుతుంటారు.

పార్కుల అభివృద్ధి ఇలా..

13వ డివిజన్ షార్కీ కాలనీలో రూ. 55 లక్షలతో పార్కును అభివృద్ధి చేసి కొద్దినెలల కిందట ప్రారంభించారు. అదే డివిజన్ బచ్చుపేటలో హిందూ కాలేజీ వెనుక ఉన్న పార్క్ స్థలంలో పార్కును రూ. 23 లక్షలతో అభివృద్ధి చేశారు. 14వ డివిజన్‌లో ఎల్‌ఐసీ కార్యాలయం పక్కన రూ. 18 లక్షల 14వ ఆర్థిక సంఘం నిధులతో పార్కును అభివృద్ధి చేశారు. 12వ డివిజన్ ఆశీర్వాదపురంలో రూ. 10 లక్షలతో చిన్న పిల్లల ఆట వస్తువులను, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. 6వ డివిజన్ డీఈఓ కార్యాలయం ఎదురు బ్రహ్మపురంలో నిర్మించిన పార్కు ప్రారంభించాల్సి ఉంది. దీనిని రూ. 30 లక్షలతో అభివృద్ధి చేశారు.



ప్రధాన పార్కులో సెల్ఫీలు తీసుకునేందుకు గోడలపై వేసిన 3డీ పెయింటింగ్స్



13వ డివిజన్‌లోని షార్కీ కాలనీ పార్కులోని ఓపెన్ జిమ్

ఆకట్టుకుంటున్నాయి



బందరు ప్రజలకు ఆనందం, ఆహ్లాదాన్ని అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని నాని చర్యలు తీసుకున్నారు. దీనిలో భాగంగానే పలు పార్కుల అభివృద్ధి, నూతన పార్కుల ఏర్పాటు జరిగాయి. ప్రధాన పార్కులో అభివృద్ధి పనులు నగర వాసులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.

– చిటికిన వెంకటేశ్వరమ్మ, మేయర్

పార్కును త్వరలో ప్రారంభిస్తాం



డివిజన్‌లోని శ్రీనివాస నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన యర్రా నాగేశ్వరరావు మునిసిపల్ పార్కును త్వరలోనే ప్రారంభిస్తాం. పార్కులో కొన్ని మొక్కలను నాటాల్సి ఉంది. ఆ పనులు పూర్తయిన తరువాత ప్రారంభిస్తాం. రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మీ ఆమె తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం పార్కు నిర్మాణానికి రూ. 5 లక్షలు విరాళం అందజేశారు.

– గాది వెంకట సాయి రఘు విఠల్, 46వ డివిజన్ కార్పొరేటర్

ఫొటో ఓటర్ల సంక్షిప్త సవరణ వేగవంతం చేయండి

కలెక్టర్ రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

చిలకలపూడి(మచిలీపట్నం): ఫొటో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఫొటో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం నిర్వహణపై సమీక్షించారు. కలెక్టర్ పి. రాజాబాబు క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమ పురోగతిని ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. జిల్లాలో ఈ కార్యక్రమం చురుకుగా కొనసాగుతోందని, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఓటరుగా నమోదు కాని వారిని గుర్తించి ఫారం–6 ద్వారా ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మరణించిన ఓటర్లను తొలగించేందుకు నిబంధనలను అనుసరించి తీసివేస్తామని చెప్పారు. ఏ నియోజకవర్గంలోనైనా ఫారం –6 అధిక సంఖ్యలో వచ్చిన సందర్భంలో సమగ్ర పరిశీలన చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై తగిన పరిశీలన చేసి పరిష్కార చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్లు సతీష్, డెప్యూటీ తహసీల్దార్ ఎంవీ శ్యామ్‌నాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబు తప్పు చేయకపోతే నిరూపించుకోవాలి

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మంగళాపురం(చల్లపల్లి): స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో చంద్రబాబు తప్పు చేయకపోతే నిరూపించుకుని బయటకు రావాలని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం సాయంత్రం చల్లపల్లి మండం మంగళాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు 367 ఇళ్లకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ప్రయోజనాలను వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు చేసిన తప్పులను కప్పిపుచ్చేందుకు పవన్ కల్యాణ్, బాలకృష్ణ ప్రయత్నిస్తున్నారన్నారు. అన్ని దర్యాప్తు సంస్థలు సమగ్ర దర్యాప్తు చేసి చంద్రబాబును అరెస్ట్ చేశాయన్నారు. చంద్రబాబుపై కక్ష సాధించాల్సిన అవసరం తమ ప్రభుత్వానికి, తమ పార్టీకి లేదని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఉచిత విద్య, వైద్యం అందిస్తున్నారని తెలిపారు. జగన్ సంక్షేమ పాలనలో ఫలితాలు ఆస్వాదిస్తున్న పేదలు ప్రతి ఒక్కరూ మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు డొక్కు నాగేశ్వరరావు, గొరిపర్తి సురేష్, వల్లూరు ఉమా, పీఏసీఎస్ చైర్మన్లు పేరం నాగిరెడ్డి, శీరం నాని, అరజా శివశంకర్, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, పార్టీ నాయకులు నల్లమోతు వీరయ్య, జుజ్జువరపు భాగ్యారావు, మేరుగు రమేష్, రాముడు, పంచాయతీ ఈఓ సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

5.22 లక్షల జరిమానా



కోనేరుసెంటర్/మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. 40 బృందాలుగా ఏర్పడిన అధికారులు బందరు మండలంలోని పలు గ్రామాల్లో 989 గృహ సర్వీసులు, 626 వాణిజ్య సర్వీసులు, 326 ఆక్వా సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 63 సర్వీసులకు అదనపు లోడును వినియోగిస్తున్నట్లు గుర్తించి సంబంధిత యజమానులకు రూ. 3,43,000 జరిమానా విధించారు. అలాగే అనుమతి ఇచ్చిన క్యాటగిరీకి విరుద్ధంగా వేరే క్యాటగిరీ వాడుతున్న ముగ్గురు వినియోగదారులకు రూ. 1,72,000 జరిమానాను విధించారు. అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న మరో వ్యక్తికి రూ. 7,000 జరిమానాగా విధించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో మచిలీపట్నం విద్యుత్ ఈఈ ఎం. భాస్కరరావు, రూరల్ డీఈఈ ఎం. శ్రీనివాసులు, బందరు రూరల్ ఏఈ కేవీవీ నాగేశ్వరరావు, మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ఏఈఈలు, జేఈలు, ఎల్‌ఐలు పాల్గొన్నారు.

మేయర్ వెంకటేశ్వరమ్మకు సన్మానం



మేయర్ వెంకటేశ్వరమ్మను సన్మానిస్తున్న నాయీ బ్రాహ్మణులు

మచిలీపట్నంటౌన్: నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. మచిలీపట్నం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం మేయర్ వెంకటేశ్వరమ్మను ఆమె నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఆమె మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. షాపులు నిర్వహించే ప్రతి ఒక్కరికీ రూ. 10 వేలు అందజేస్తూ వ్యాపారాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వి. సుధాకర్, నాయకులు తరకటూరి సీతారాముడు, సీహెచ్ రమణ, వి. నాగేంద్రరావు, సీహెచ్ కృష్ణ, సుబ్బు, వాసు, జగదీష్, పి. ఆంజనేయులు, కె. సుబ్రహ్మణ్యం, పి. మురళి పాల్గొన్నారు.

విధులను సక్రమంగా నిర్వహించండి

మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ



రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. మంగళవారం ఆమె కార్యాలయంలోని పబ్లిక్ హెల్త్ విభాగాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగులు ఏ సమయానికి కార్యాలయానికి వస్తున్నది అడిగి తెలుసుకుని అటెండెన్స్‌ను పరిశీలించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ ఎలా జరుగుతున్నదీ ఆరా తీశారు. నగరంలోని పలు దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ ఎలా ఇస్తున్నదీ రికార్డులను పరిశీలించారు. చెత్త పన్ను వసూలు పురోగతి ఎలా ఉన్నది అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు, సిబ్బంది కార్యాలయానికి సకాలంలో విచ్చేసి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, కార్పొరేటర్ మేకల సుబ్బన్న పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం



అవనిగడ్డలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



గూడూరులో ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

గూడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన మండల స్థాయి అండర్–14, 17 బాలుర ఆటల పోటీలను ఎంపీపీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బాలబాలికలకు చదువులతో పాటుగా క్రీడలు కూడా ముఖ్యమన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాంశంలో రాణించాలని సూచించారు. ప్రభుత్వం నైపుణ్యం గల క్రీడారులను ప్రోత్సహిస్తోందన్నారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులను నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి జట్లకు ఎంపిక చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ శేఖర్‌సింగ్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లు వాసు, వైఎస్సార్ సీపీ నాయకులు లింగం విజయ్‌కుమార్, ఇన్‌చార్జి హెచ్‌ఎం పద్మజ, మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి మత్తి అరుణ, పీడీలు మురళి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా పోటీలు

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ పోటీలను ప్రారంభించారు. అనంతరం అండర్ –14, అండర్ –17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, బాడ్మింటన్, యోగా, షటిల్ పోటీల్లో పలువురు క్రీడాకారులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా పాల్గొనగా, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



మచిలీపట్నంటౌన్: ఈడేపల్లిలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి 1008 బత్తాయిలతో అలంకరణ చేశారు. మహాలక్ష్మీ జ్యూస్ షాప్ యజమాని వంశీకృష్ణ బత్తాయిల అలంకరణను చేయించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శిథిలావస్థకు చేరిన పోలింగ్ కేంద్రాల పరిశీలన



సూరదాయిపేటలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాజ్యలక్ష్మి

గూడూరు: మండలంలో శిథిలావస్థకు చేరిన పోలింగ్ కేంద్రాలను పెడన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి మంగళవారం పరిశీలించారు. మండలంలోని కోకనారాయణపాలెం, పోసినవారిపాలెం శివారు సూరదాయిపేటలోని మండల పరిషత్ పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుతం వీటిలోని రెండు బూత్‌లు వేరే భవనాలలోకి మార్చేందుకు సాధ్యాసాధ్యాలను ఆమె పరిశీలించారు. కోకనారాయణపాలెంలోని పోలింగ్ కేంద్రాన్ని సమీపంలోని రైతు భరోసా కేంద్రంలోకి, సూరదాయిపేటలోని పోలింగ్ కేంద్రాన్ని స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలోకి ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని ఆమె తహసీల్దార్ బి.విజయప్రసాద్‌ను ఆదేశించారు. ఇప్పటివరకు ఓటరు జాబితాలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై ఈనెల 15లోగా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో కాకుశేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

శివరామకృష్ణ క్షేత్రం నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



లక్ష నగదును అందిస్తున్న రాము దంపతులు



విరాళం అందిస్తున్న మల్లికార్జునరావు దంపతులు

కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి ఇద్దరు దాతలు రూ.2 లక్షలను విరాళంగా అందించారు. కోడూరుకు చెందిన యండూరి లక్ష్మీమల్లికార్జునరావు–రాజ్యలక్ష్మి దంపతులు రూ.లక్ష నగదు, ఇస్మాయిల్‌బేగ్ పేట గ్రామానికి చెందిన చందన రాము–అంకమ్మ దంపతులు రూ.లక్ష నగదును ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందించారు. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో ఈ క్షేత్రం నిర్మాణం జరుగుతోందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు అన్నం వెంకట సుబ్బారావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ, తూనుగుంట్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వేలం పాటలు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద రెండేళ్ల కాలపరిమితికి వివిధ వేలం పాటలను బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కేవీ గోపాలరావు మంగళవారం చెప్పారు. భక్తులకు షామియానా వంట పాత్రల సరఫరా, తలనీలాలు, పాదరక్షలు భద్రపర్చడం తదితర పనులను లీజుకు ఇవ్వడానికి వేలం నిర్వహిస్తామన్నారు. అదే రోజు ఉదయం 10 గంటలకు పెద్దింట్లమ్మకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కిస్తామని తెలిపారు.

ప్రతి ఇంటికీ కుళాయి

మండవల్లి: జల్‌జీవన్ మిషన్ నిధులు మండవల్లికి రూ. 69 లక్షలు, అగ్రహారానికి రూ. 9 లక్షలు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వి.వి. కృష్ణారావు మంగళవారం మండవల్లిలో పేర్కొన్నారు. ఐక్య వేదిక మండల శాఖ ఎల్‌ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు ఇటీవల స్పందన కార్యక్రమంలో జల్‌జీవన్ మిషన్ నిధులతో కుళాయిలు ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఏఈఈ కృష్ణారావు ఈ విషయంపై టెండర్ ప్రక్రియ కూడా పూర్తి అయినట్లు తెలిపారు. పైపులైన్ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. సుమారు నెల రోజుల్లో కుళాయిలు లేనివారికి ఇంటికో కుళాయి ఉచితంగా అంజేయనున్నామని వివరించారు.

నేడు నూతన పింఛన్ల పంపిణీ

కృత్తివెన్ను: నూతనంగా మంజూరైన సామాజిక పింఛన్లను బుధవారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. ఈ కార్యక్రమం కృత్తివెన్ను శివాలయం వద్ద ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు.

మచిలీపట్నంటౌన్: నగరంలో నూతనంగా మంజూరైన పింఛన్లను బుధవారం పంపిణీ చేస్తామని కమిషనర్ జి. చంద్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి 920 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు హాజరై లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తారన్నారు. ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు 25 నుంచి 40వ డివిజన్ వరకు రాజుపేట షాదీఖానాలో 290 మందికి పింఛన్లు అందజేస్తారని చెప్పారు. 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 13, 15 డివిజన్ల నుంచి 24వ డివిజన్‌వరకు పోర్టు రోడ్డులోని మెహర్‌బాబా ఆడిటోరియంలో 206 పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు బైపాస్ రోడ్డులోని వాసవీ కల్యాణ మండపంలో ఒకటో డివిజన్, 41వ డివిజన్ నుంచి 50వ డివిజన్లలో 214 పింఛన్లను అందజేస్తారని చెప్పారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు పరాసుపేట సువర్ణ కల్యాణ మండపంలో 2 నుంచి 12 వ డివిజన్ వరకు, 14 డివిజన్‌లోని 210 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మచిలీపట్నం డివిజన్
99122 20543 (మచిలీపట్నం, పెడన)
79955 66983, 99122 20545 (అవనిగడ్డ)
Office mail : sakshiads@gmail.com